సాక్షి
నిజామాబాద్
సోమవారం ı 30 ı అక్టోబర్ ı 2023



టీడీపీ కంచుకోటలో బీఆర్ఎస్..
డిచ్‌పల్లి నియోజకవర్గం గతంలో టీడీపీకి కంచుకోటగా ఉండేది. ఆ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ పాగా వేసింది.
- 10లో ▸



ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు
ఎన్నికల సమయంలో ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బంది లేకుండా చూస్తామని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి పేర్కొన్నారు.
- 10లో ▸



వాతావరణం
ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండతీవ్రత ఉండవచ్చు. మధ్యాహ్నం నుంచి చల్లటి గాలులు వీస్తాయి. రాత్రివేళ పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బాబ్లీగేట్ల మూసివేత



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆదివారం త్రిసభ్య కమిటీ సభ్యుల సమక్షంలో మూసివేశారు. సుప్రీంతీర్పు ప్రకారం ప్రతి ఏడాది జూలై 1న గేట్లు ఎత్తి, అక్టోబర్ 29న గేట్లను మూసివేయాలి. ఈ ఏడాది కూడా సుప్రీం తీర్పునను సరించి త్రిసభ్య కమిటీ సభ్యులు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 14 గేట్లను మూసివేశారు. ప్రస్తుతం బాబ్లీ ప్రాజెక్ట్‌లో 0.41 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 2.4 టీఎంసీలు. గేట్ల మూసివేతతో ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు నిలిచిపోనుంది. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ తరుపున ఈఈ వెంకటేశ్వర్లు, మహారాష్ట్ర తరుపున నాందేడ్ ఈఈ బస్సోద్, ఎస్సారెస్పీ తరుపున ఈఈ చక్రపాణి, ఏఈఈలు జేసీ సీడబ్ల్యూసీ సతీష్ పాల్గొన్నారు. మార్చి ఒకటిన 0.6 టీఎంసీల నీటి కోసం బాబ్లీగేట్లు ఎత్తి ఎస్సారెస్పీకి నీటి విడుదల చేసి మళ్లీ గేట్లను మూసివేస్తారు.

రూ.1.74 కోట్ల నగదు రిలీజ్

- సీపీ కల్మేశ్వర్ వెల్లడి

సుభాష్‌నగర్ : జిల్లాలో ఎన్నికల నియమావళిని అనుసరించి రూ. 2,86,74,344 నగదు, బంగారు, వెండి వస్తువులు, మద్యం, మత్తు పదార్థాలను సీజ్ చేశామని, సరైన ధ్రువపత్రాలు చూపించిన వారికి చెందిన రూ. 1,74,15,858 రిలీజ్ చేశామని సీపీ కల్మేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన తేదీ అక్టోబర్ 9, 2023 నుంచి అక్టోబర్ 28 వరకు అర్బన్, రూరల్, బాల్కొండ, ఆర్మూర్, బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిక్ సర్వే లైన్స్ టీమ్స్, పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలను ఎన్నికల అవినీతి కార్యకలాపాలను అరికట్టడానికి తనిఖీలు చేపట్టామని పేర్కొన్నారు. పట్టుబడిన స్థలంలో వస్తువులు, నగదుకు సంబంధించిన ధ్రువపత్రాలు చూపించకపోవడం, సరైన కారణాలు తెలియజేయకపోవడంతో సీజ్ చేశామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రూ. 10 లక్షల కన్నా తక్కువ నగదు పట్టుబడితే, అనుమానాస్పదంగా ఎన్నికలకు సంబంధించిన ఏదైనా వస్తువులు పట్టుబడితే ఆ నగదు, వస్తువులను జిల్లా ఎన్నికల కార్యాలయంలో గ్రీవెన్స్ కమిటీకి జమ చేస్తున్నామన్నారు. రూ. 10 లక్షల కన్నా ఎక్కువ నగదు పట్టుబడితే జిల్లా ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగిస్తామని, సరైన ధ్రువపత్రాలు చూపించిన వారికి నగదు తిరిగి ఇస్తున్నామన్నారు. ఇప్పటిదాకా రూ. 41,81,000 నగదును జప్తు చేసి ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు డిపాజిట్ చేశామని సీపీ పేర్కొన్నారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



వేల్పూర్ : వేల్పూర్ క్రాస్‌రోడ్డుకు సమీపంలో ఉన్న స్పైస్‌పార్కులో ఈనెల 2న జరుగనున్న బాల్కొండ నియోజకవర్గం సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. సీఎం సభాస్థలి, పార్కింగ్, హెలీప్యాడ్ ప్రాంతాలను పరిశీలించి సభ ఏర్పాటు పరిశీలకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.


నేటి నుంచి జీవాలకు టీకాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా వ్యాప్తంగా ఈ నెల 30వ తేదీ నుంచి గొర్రెలు, మేకలకు ఉచితంగా పీపీఆర్ (పుర్రరోగం) వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వి. జగన్నాథచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలను పశువైద్య అధికారులు సందర్శించి గొర్రెలు, మేకలకు టీకా లు వేయాలని ఆదేశించామన్నారు. నాలుగు నెలలుపైబడి వయసున్న జీవాలకు టీకాలు వేయించాలని సూచించారు. జిల్లాలో సుమారు 8.2లక్షల జీవాలకు టీకాలు వేయనున్నామని, పీపీఆర్ వ్యాక్సిన్లు ఇప్పటికే మండలాలకు సరఫరా చేసినట్లు తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవాలకు టీకాలు వేయించాలని కోరారు.

టికెట్ల కథలో ట్విస్ట్‌లెన్నో..

తెలంగాణ శాసనసభ ఎన్నికల అభ్యర్థులకు సంబంధించి ఇప్పటికే రెండు జాబితాలు ప్రకటించిన కాంగ్రెస్ అధినాయకత్వం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని సీట్ల విషయంలో ఎడతెగని కసరత్తు చేస్తోంది. దీంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. – సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

- కాంగ్రెస్ టికెట్ల కేటాయింపులో ఊహించని మలుపులు
- నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి సీట్లపై ఎడతెగని కసరత్తు
- అర్బన్ నుంచి షబ్బీర్ అలీకి అవకాశం?
- లేని పక్షంలో జహీరాబాద్ పార్లమెంట్‌కు పంపే ఆలోచన
- మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి కేబినెట్ అవకాశమిస్తామని హామీ



శాసనసభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్‌లో రెండు విడతల జాబితాలను కలిపి 9 స్థానాలకు గాను 5 స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. మరో 4 సీట్ల విషయమై టికెట్ల కేటాయింపు విషయంలో కథ అనేక మలుపులు తిరుగుతోంది. ట్విస్ట్‌ల మీద ట్విస్ట్‌లు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఉన్న 9 నియోజకవర్గాల్లో 5 సెగ్మెంట్లు నిజామాబాద్ పార్లమెంట్, 4 సెగ్మెంట్లు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. ఇదిలా ఉండగా ప్రతి పార్లమెంట్ స్థానం పరిధిలో బీసీలకు కనీసం రెండు సీట్లు ఇవ్వాలనే డిమాండ్ ఉంది. అయితే నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఇప్పటివరకు 6 స్థానాలు ఓసీలకే కేటాయించారు. మిగిలిన ఒక్క నిజామాబాద్ అర్బన్ సీటును బీసీ అభ్యర్థికి కేటాయించాలనే డిమాండ్ ఉన్నప్పటికీ మైనారిటీ అభ్యర్థి అంశం తెరమీదకు వచ్చింది. దీంతో ప్రతిష్టంభన నెలకొంది.

మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ..

ఇక టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉంటూ పార్టీ ఆర్గనైజింగ్ వ్యవహారాలను చక్కబెడుతూ వస్తున్న బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ కూడా నిజామాబాద్ అర్బన్ టికెట్ కోసం మొదటి నుంచి పట్టుబడుతూ వస్తున్నారు. అయితే మారిన సమీకరణాల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్‌కు అధికారంలోకి వస్తే మొదటి విడతలోనే ఎమ్మెల్సీ ఇచ్చి కేబినెట్ బెర్త్ కేటాయించేందుకు పార్టీ అధిష్టానం హామీ ఇచ్చినట్లు తెలిసింది.

కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి..!

ఇదిలా ఉండగా కామారెడ్డిలో కేసీఆర్ ప్రత్యర్థిగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని బరిలోకి దింపేందుకు పార్టీ అధిష్టానం ఆలోచన చేస్తోంది. ఈ నేపథ్యంలో షబ్బీర్‌ను నిజామాబాద్ అర్బన్‌కు పంపేందుకు ఆలోచన చేస్తున్నారు. అయితే ధర్మపురి సంజయ్ బీసీ కోటాలో తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా రేవంత్ కా మారెడ్డిలో బరిలోకి దిగితే అక్కడి వ్యవహారాలను షబ్బీర్ మాత్రమే చూడాల్సి ఉంటుందని, ఇది అనివార్యమనే చర్చ వచ్చింది. ఇలాంటి పరిస్థితి వస్తే ష బ్బీర్‌కు జహీరాబాద్ లేదా నిజామాబాద్ పార్లమెంట్ సీటు కేటాయించేలా పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకునే దిశగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ మూడో జాబితా విడుదలకు ముందే షబ్బీర్‌అలీ పేరును నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్లలో ఒకదానికి ప్రకటించే నిర్ణయాన్ని వెలువరించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సంజయ్ లేదా తాహెర్ బిన్..?

ఇలాంటి నేపథ్యంలో నిజామాబాద్ అర్బన్ స్థానాన్ని బీసీ కోటాలో ధర్మపురి సంజయ్‌కు కేటాయిస్తారా, మైనారిటీ కోటాలో తాహెర్‌బిన్ హందాన్‌కు కేటాయిస్తారా అనేది చూడాల్సి ఉంది. మొత్తానికి నిజామాబాద్ అర్బన్ సీటు వద్ద మొదలైన మలుపు కామారెడ్డి అసెంబ్లీ స్థానంతో ముడిపడి చివరకు నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలకు లింక్ కలవడంతో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. దీనిపై అధిష్టానం కసరత్తులు చేయాల్సిన పరిస్థితి నెలకొనడం గమనార్హం.

ఒక్కరోజు.. రెండు సభలు


జుక్కల్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సభా వేదిక

- నేడు జుక్కల్, బాన్సువాడలలో ప్రజా ఆశీర్వాద సభలు
- పాల్గొననున్న సీఎం కేసీఆర్
- భారీ జన సమీకరణపై నేతల దృష్టి

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. జుక్కల్ చౌరస్తా, బాన్సువాడలలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలలో ఆయన పాల్గొంటారు. సభను విజయవంతం చేయడం కోసం భారీ జన సమీకరణపై పార్టీ నేతలు దృష్టి సారించారు. జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా అన్నింటా అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కామారెడ్డిలో సిట్టింగ్ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు బదులు సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నారు. బాన్సువాడలో స్పీకర్ పోచారం, ఎల్లారెడ్డిలో జాజాల సురేందర్, జుక్కల్‌లో హన్మంత్ సింధే బరిలో ఉన్నారు. అధికార పార్టీ ముందుగానే అభ్యర్థులను ప్రకటించడంతోపాటు బీ ఫామ్‌లూ అందించింది.

సీఎం పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరతారు. మధ్యాహ్నం 2 గంటలకు జుక్కల్ చౌరస్తా వద్ద ప్రజా ఆశీర్వాద సభ వేదికకు సమీపంలో ఏర్పాటు చేసిన హెలీపాడ్ వద్దకు చేరుకుంటారు. స్థానిక ఎమ్మెల్యే హన్మంత్ సింధే అధ్యక్షతన జరిగే సభలో మాట్లాడతారు. సభ అనంతరం తిరిగి హెలీకాప్టర్‌లో బయలుదేరి బాన్సువాడ పట్టణంలోని అంగడిలోని సభాస్థలికి సమీపంలో ఏర్పాటు చేసిన హెలీపాడ్ వద్ద దిగి, నేరుగా ప్రజా ఆశీర్వాద సభా వేదిక వద్దకు చేరుకుంటారు. బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం తరపున ప్రచారం చేస్తారు.

సభను విజయవంతం చేయండి

బాన్సువాడ: బాన్సువాడలో సోమవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన బాన్సువాడ వీక్లీ మార్కెట్‌లో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాల పార్కింగ్, హెలీప్యాడ్ స్థలాలను పరిశీలించి, పార్టీ నాయకులకు పలు సూచనలు ఇచ్చారు. సభకు వచ్చే ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామం నుంచి 500 మందికి తక్కువ కాకుండా సభకు తరలిరావాలని స్పీకర్ కోరారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, సీఐ మహేందర్ రెడ్డి, నాయకులు పోచారం శంభురెడ్డి, పోచారం రవీందర్‌రెడ్డి, అంజిరెడ్డి, గురువినయ్, జంగం గంగాధర్, జుబేర్, బాబా, ఎజాస్ ఉన్నారు.


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం

ఆర్నెళ్లుగా వేతనాల్లేవ్..

- అవస్థల్లో విలీన వీఆర్ఏలు
- వివిధ శాఖల్లో కలిపేసినప్పటికీ అన్యాయమే..
- వేతనాల చెల్లింపులు పూర్తిగా నిలుపుదల
- సాంకేతిక కారణాలు చెబుతున్న అధికారులు

మోర్తాడ్(బాల్కొండ): వివిధ ప్రభుత్వ శాఖల్లో విలీనం చేయబడిన విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్(వీఆర్ఏ)లకు ఆర్నెళ్లుగా వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వీఆర్ఏలకు పేస్కేల్ వర్తింపజేస్తూ పలు శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులలో వీరిని భర్తీ చేసిన విషయం విదితమే. పేస్కేల్ కోసం 88 రోజుల పాటు సమ్మె చేయగా ఆ సమ్మె కాలానికి సంబంధించిన వేతనంతో పాటు విలీనం జరిగిన నుంచి మరో మూణ్నెళ్ల వేతనాలను ప్ర భుత్వం చెల్లించాల్సి ఉంది. వీఆర్ఏలలో అనేక మందిని నీటిపారుదల శాఖ, విద్యాశాఖ, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల్లో విలీనం చేశారు. వీఆర్ఏల విద్యార్హతలను పరిగణలోకి తీసుకుని వారిని అటెండర్లుగా, జూనియర్ అసిస్టెంట్‌లుగా, రికార్డు అసిస్టెంట్లుగా నియమించారు. జిల్లాలో 1,624 మంది వీఆర్ఏలకు పేస్కేల్‌ను అమలు చేస్తూ అవసరం ఉన్న శాఖల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. గడిచిన మూడు నెలల నుంచి తాము విలీనమైన శాఖలలోనే వీఆర్ఏలు పని చేస్తున్నారు. వీఆర్ఏల విలీనంకు సంబంధించి హైకోర్టులో ఉన్న కేసు కూడా పరిష్కారమైంది. అయినప్పటికీ వేతనాల విషయంలో ప్రభుత్వం స్పందించడం లేదు. పేస్కేల్ ఉత్తర్వులను జారీ చేయడంతో పాటు విలీనమైన శాఖలో పోస్టింగ్ ఇవ్వడం సర్వీస్‌బుక్‌లో వివరాల నమోదు ఇలా అన్ని రకాల ప్రక్రియ పూర్తి చేశారు. అయినప్పటికీ వేతనాల చెల్లింపు విషయంలో అలసత్వం వహించడం సరి కాదని ఉద్యోగులు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఆరు నెలల నుంచి వేతనాలు అందక ఇల్లు గడవడం కష్టంగా ఉందని ఉద్యోగులు వాపోతున్నారు. తమ అభీష్టం మేరకు విలీనం చేసి పనులు చేయించుకుంటున్నారని వేతనాల విషయం అడిగితే సాంకేతిక కారణం సాకుగా చూపుతున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. దసరా సందర్భంగా కనీసం కొత్త దుస్తులు కూడా కొనుక్కోలేని దుస్థితిలో తాము ఉండిపోయామని విలీన వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఫోన్ కొట్టు.. ఓటు పట్టు..

- అసెంబ్లీ అభ్యర్థుల ప్రచారంలో ఓటర్లకు ఫోన్‌కాల్స్
- సంక్షేమ, అభివృద్ధి పథకాల లబ్ధిదారులే టార్గెట్

"హలో.. జ్యోతి గారేనా మాట్లాడేది.. మీకు ఆసరా పథకంలో భాగంగా వితంతు పింఛన్ అందుతోందా.. పింఛన్ తీసుకోవడంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఇప్పుడు మీకు నెలకు రూ. 2,016 పింఛన్ వస్తోంది కదా.. బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపిస్తే నెలకు రూ. 5,000 పింఛన్ వస్తుంది.. కాబట్టి మీరు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికే ఓటు వేయండి'' అంటూ ఒక మహిళ జ్యోతికి వివరించింది.

ఆర్మూర్ : నియోజకవర్గాల్లో ప్రతి లబ్ధిదారుడికి ఇలా నిత్యం ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. ఆసరా పథకంలో భాగంగా వృద్ధాప్య పింఛన్, వికలాంగుల పింఛన్, వితంతు పింఛన్, బీడీ కార్మికుల జీవన భృతి పొందుతున్న మహిళలను టార్గెట్ చేసుకుని ఫోన్లు చేస్తున్నారు. రైతులకు 24 గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా అవుతోందా.. ఎకరానికి రూ. 10 వేల పెట్టుబడి వ్యయం అందిందా.. రైతు బీమా పథకంలో పేరు నమోదు చేయించుకున్నారా.. తదితర సమాచారాన్ని అడుగుతూ ఫోన్లు చేస్తున్నారు. మరో వైపు కాంగ్రెస్, బీజేపీలు కూడా తాము అధికారంలో ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పథకాలను కూడా ఓటర్లకు ఫోన్ల ద్వారా వివరిస్తున్నారు.



మారుతున్న పరిస్థితులకు అనుగుణంలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు విజయాన్ని సొంతం చేసుకునేందుకు ఉన్న ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకుండా సద్వినియోగం చేసుకోవాలనే ప్రయత్నాల్లో ఉన్నారు. నేటి రోజుల్లో సెల్ ఫోన్ ఉపయోగించని ఓటరు ఉండడన్నది కాదనలేని నిజం.

కాల్ సెంటర్లతో ఒప్పందాలు..

ప్రత్యేకంగా కాల్ సెంటర్ల వారితో ఒప్పందాలు చేసుకొని తమ నియోజకవర్గాల పరిధిలోని లబ్ధిదారులు, ఓటర్ల ఫోన్ నెంబర్లను వారికి చేరవేస్తున్నారు. ఇంకేముంది సదరు కాల్‌సెంటర్ ఉద్యోగులు ఒకటికి పదిసార్లు ఓటర్లకు ఫోన్లు చేస్తూ తమ పార్టీ గొప్పతనాన్ని తమ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి బలాబలాలను ఓటర్లకు వివరిస్తున్నారు. మరికొందరు అభ్యర్థులు ఒక అడుగు ముందుకేసి తనకు ఓటువేసి గెలిపించాలంటూ ఓటర్లను విజ్ఞప్తి చేస్తూ వాయిస్ రికార్డు చేసి ఫోన్లు చేస్తూ ఆ వాయిస్ రికార్డును వినిపిస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహిస్తే ఇంటర్నెట్ ఉపయోగించే వారికే సమాచారం చేరడానికి ఆస్కారం ఉంది. కాని ఫోన్ చేసి వివరాలు చెబితే సెల్‌ఫోన్ ఉపయోగించే మహిళలు, వృద్ధులు, నిరక్షరాస్యులకు కూడా సమాచారం చేరవేసే ఆస్కారం ఏర్పడుతోంది.

రుణమాఫీకి నిధుల గండం

- లక్ష్యానికి అనుగుణంగా సాగని ప్రక్రియ
- బ్యాంకర్లు, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయం కరువు
- రైతులకు అందని సమాచారం

ఏర్గట్ల మండలం తొర్తికి చెందిన రైతు మాదాం నర్సయ్యకు రుణం మాఫీ అయినట్లు మెసేజ్ వచ్చింది. ఆయన పాలెం బ్యాంకులో సంప్రదించగా ఖాతాలో మాత్రం సొమ్ము జమ కాలేదు. రెండు నెలల నుంచి రుణం మాఫీ సొమ్ము ఎప్పుడు జమ అవుతుందా అని నర్సయ్య బ్యాంకు చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు.



మోర్తాడ్: ప్రభుత్వం రుణమాఫీకి అవసరమైన నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవడంతో ఎంతో మంది రైతులకు మాఫీ సొమ్ము జమకాలేదు. గడచిన ఆగస్టులో రుణమాఫీ ప్రక్రియను మొదలు పెట్టగా సెప్టెంబర్ రెండో వారానికి అర్హులైన అందరు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. లక్ష్యానికి అనుగుణంగా నిధులను విడుదల చేయకపోవడంతో ప్రక్రియ పూర్తి కావడం లేదు. గత ఎన్నికల సందర్భంలో ఏక కాలంలోనే రూ.లక్ష వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తామని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు హామీ ఇచ్చిన విషయం విదితమే. అప్పట్లో ప్రభుత్వం కొలువుదీరిన తరువాత వ్యవసాయ శాఖ ద్వారా పంట రుణాలు పొందిన రైతుల వివరాలను సేకరించారు. జిల్లాలో 2,91,188 మంది రైతులకు పంట రుణాలను మాఫీ చేయాల్సి ఉంది. ఇందుకు అవసరమైన సొమ్ము మొత్తం రూ.1,790 కోట్లు, ఈ నెల 9వ తేది వరకు మాత్రమే రైతుల ఖాతాల్లో మాఫీ సొమ్ము జమ చేశారు. అప్పటి వివరాల ప్రకారం జిల్లాలో 67,553 మంది రైతులకు రూ.324.63 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. ఇంకా 2,23,635 మంది రైతులకు రూ.1,465.77 కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉంది.

స్పష్టత కరువు

రుణమాఫీపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో బ్యాంకర్లు, వ్యవసాయ శాఖలకు ఎలాంటి సమాచారం లేదు. వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుంది.

అప్పటి వరకు మాఫీ సొమ్ము విడుదల కాకపోతే రుణమాఫీకి బ్రేక్ పడుతుందనే అనుమానాలు ఏర్పడుతున్నాయి. ఎన్నికలు సమీపించిన తరుణంలోనే ప్రభుత్వం రుణమాఫీపై చర్యలు తీసుకుంది. సకాలంలో పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో రుణమాఫీ ఆశించిన స్థాయిలో జరగలేదు. మెజార్టీ రైతులకు రుణాలు మాఫీ కాకపోవడంతో ఈ ప్రభావం అభ్యర్థుల గెలుపు ఓటములపై చూపుతుందని కూడా ప్రచారం జరుగుతోంది.



ప్రభుత్వం మాట తప్పింది



రుణమాఫీ విషయంలో ప్రభుత్వం మాట తప్పింది. నాలుగేళ్ల నుంచి రుణ మాఫీని పట్టించుకోక, ఎన్నికల వేళ ప్రకటన చేయడం చూస్తుంటే ఈ అంశంపై చిత్త శుద్ధి లేదని తెలుస్తుంది. రైతులపై ప్రేమ ఉంటే ఎప్పుడో నిధులు విడుదల చేయాలి.
– కొర్రిపెల్లి లింగారెడ్డి, రైతు, దోంచంద

నిరాశలో రైతులు



కొందరు రైతులకే రుణాలు మాఫీ జరిగి అనేక మందికి మాఫీ కాకపోవడంతో వారు నిరాశ చెందుతున్నారు. అన్నదాతలు ఎంతో ఇబ్బందుల్లో ఉన్నారు. మాఫీ సొమ్ము జమ చేసి ఉంటే కొంతైనా ఊరట లభించేది.
– బద్దం రాజశేఖర్, రైతు, తిమ్మాపూర్

స్వతంత్రంగా ఎన్నికల బరిలోకి దిగి..

- ఉమ్మడి జిల్లాలో 9 మంది గెలుపు
- సమీప ప్రత్యర్థులు కాంగ్రెస్ అభ్యర్థులే..

నిజామాబాద్ సిటీ : ఉమ్మడి జిల్లాలో 1952 నుంచి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. గడిచిన 75ఏళ్లలో ఉమ్మడి జిల్లాలో 32 మంది స్వతంత్య్ర అభ్యర్థులు పోటీ చేయగా తొమ్మిది మంది గెలిచి 23 మంది ఓడిపోయారు. నిజామాబాద్, బోధన్, కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. మిగితా బాల్కొండ, ఆర్మూర్, డిచ్‌పల్లి, ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాలలో ఎవరూ స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయలేదు. గెలిచిన స్వతంత్ర అభ్యర్థులందరూ కాంగ్రెస్ పార్టీపైనే గెలుపొందటం విశేషం. ఇందులో రెండుసార్లు ఎస్ విఠల్‌రెడ్డి గెలుపొందగా, మిగితా వారందరూ ఒక్కోసారి గెలిచారు. ఆ రోజుల్లో ఓటుకు విలువ ఉండేది. వ్యక్తిని చూసి ఓట్లు వేసేవాళ్లు. పార్టీని చూసి ఓటు వేసేవాళ్లు కాదు. ఆయన మంచీచెడులపైనే ఓటమి గెలుపు ఆధారపడి ఉండేది. కాని ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.



గెలిచిన స్వతంత్రుల వివరాలు

ఏడాది	నియోజకవర్గం	గెలిచిన అభ్యర్థి	పోలైనఓట్లు	ఓడిన అభ్యర్థి	పోలైనఓట్లు	పార్టీ
1962	నిజామాబాద్	హరినారాయణ	16,535	ఎండీ దావూద్‌హుస్సేన్	11,431	కాంగ్రెస్
1967	నిజామాబాద్	కేవీ గంగాధర్	14,234	ఎండబ్ల్యూ అహ్మద్‌బేగ్	9,609	కాంగ్రెస్
1972	నిజామాబాద్	డాక్టర్ వీ చక్రధర్‌రావు	30,506	పి గంగాధర్	12,444	కాంగ్రెస్
1957	బోధన్	శ్రీనివాసరావు	11,704	కేవీరెడ్డి	8,180	కాంగ్రెస్
1962	బోధన్	ఎం రాంగోపాల్‌రెడ్డి	19,416	కేవీరెడ్డి	16,596	కాంగ్రెస్
1967	బోధన్	ఆర్ భీంరావు	22,872	కేవీరెడ్డి	14,264	కాంగ్రెస్
1967	కామారెడ్డి	పి మధుసూదన్‌రెడ్డి	28,762	వీవీరెడ్డి	8,347	కాంగ్రెస్
1967	జుక్కల్	ఎస్ విఠల్‌రెడ్డి	18,280	ఎస్ఆర్‌టీ	14,953	కాంగ్రెస్
1972	జుక్కల్	ఎస్ విఠల్‌రెడ్డి	19,267	ఆర్ వెంకట్రాంరెడ్డి	14,944	కాంగ్రెస్

క్లుప్తంగా

అలరించిన తెలంగాణ ఆర్గానిక్‌ మేళా



నిజామాబాద్‌ సిటీ: నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నాబార్డు, సాయి వెజిటేబుల్‌ ఫ్రూట్‌ గ్రోయర్స్‌ పరస్పర సహాయసహకార సంఘం లిమిటెడ్‌ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ఏర్పాటు చేసిన తెలంగాణ ఆర్గానిక్‌ మేళా ప్రజలను అలరించింది. ఆదివారం మేళా చివరిరోజు కావడంతో ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా మేళాలో ఏర్పాటు చేసిన 30 స్టాల్స్‌లలో సేంద్రియ ఎరువుతో పండించిన పంటలు, ఆహార ఉత్పత్తులు, దేశీ వస్తువులను ఏర్పాటు చేయగా ప్రజలు వీటికొనుగోలుపై ఆసక్తి చూపారు. మేళాకు నాబార్డు తెలంగాణ డీజీఎం దీప్తి సునీల్‌, ఎస్‌బీఐ రీజినల్‌ మేనేజర్‌ శ్రీకాంత్‌, చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ జిల్లా అధ్యక్షుడు నల్లా దినేశ్‌రెడ్డిలు హాజరై మేళా ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా దినేశ్‌రెడ్డి తన తల్లి జ్ఞాపకార్థంగా ఉత్తమ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మూడోరోజు సాయి వెజిటేబుల్‌ ఫ్రూట్‌ గ్రోయర్స్‌ పరస్పర సహాయసహకార సంఘం చైర్మన్‌ కొండెల సాయారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో జాతీయ రైతు కన్వీనర్‌ కుమారస్వామి పాల్గొన్నారు.

రైలులో గంజాయి స్వాధీనం



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని విశాఖ–నాందేడ్‌ రైలులో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్సై తావునాయక్‌ అన్నారు. ఆదివారం నిజామాబాద్‌ రైల్వే ఎస్సై, ఆర్పీఎఫ్‌ సీఐ తనిఖీలు చేస్తుండగా జనరల్‌ కోచ్‌లో ఒక బ్యాగ్‌ అనుమానస్పదంగా కనపడడంతో దానిని పరిశీలించగా సుమారు 7కిలోల 750 గ్రాముల గంజాయి లభించిందన్నారు. దీని విలువ రూ. 1.93లక్షలు ఉంటుందన్నారు. నిజామాబాద్‌ ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌కు తగు చర్య నిమిత్తం అప్పగించిన్నట్లు తెలిపారు.

సోదాల్లో నగదు పట్టివేత



నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని మాధవనగర్‌ బైపాస్‌ రోడ్డులో ఆదివారం రూరల్‌ సీఐ వెంకట నారాయణ, ఎస్సై మహేశ్‌ కుమార్‌ వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో రూ. మూడు లక్షల నగదును సీజ్‌ చేసినట్లు ఎస్సై మహేశ్‌కుమార్‌ తెలిపారు. నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్‌ చేసినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్‌ అమల్లో ఉన్నందున వాహనదారులు నగదుకు సంబంధించిన వివరాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో రూరల్‌ పోలీస్‌ సిబ్బంది, ఫైయింగ్‌ స్క్వాడ్‌ అధికారులు ఉన్నారు.

కేసీఆర్‌ సభలను విజయవంతం చేయాలి


విఠల్‌రావు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ ఉమ్మడి జిల్లాలో జరిగే సీఎం కేసీఆర్‌ సభలను ప్రజలు విజయవంతం చేయాలని జిల్లా పరిషత్‌ చైర్మన్‌ దాదాన్నగారి విఠల్‌రావు ఆదివారం తెలిపారు. ఈ నెల 30న బాన్సువాడలో, నవంబర్‌ 2న బాల్కొండ, 3న ఆర్మూర్‌లో జరిగే సభలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై, విజయవంతం చేయాలని ఆయన కోరారు.


టీడీపీ కంచుకోటలో బీఆర్‌ఎస్‌ పాగా

- ఆరు సార్లు టీడీపీ, రెండుసార్లు కాంగ్రెస్‌, మూడు సార్లు బీఆర్‌ఎస్‌ ప్రాతినిధ్యం
- ఒకసారి సోషలిస్ట్‌ పార్టీకి అవకాశం
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా మండవ వెంకటేశ్వరరావు
- ఈ ఎన్నికల్లో గెలిచేదెవరో?


ఆకుల లలిత


బాజిరెడ్డి గోవర్ధన్‌


వెంకటేశ్వరరావు



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా ఉండేది. ప్రత్యేక తెలంగాణతో బీఆర్‌ఎస్‌ పాగా వేసినట్లయింది. 1952లో ఏర్పడిన నియోజకవర్గంలో ఇప్పటి వరకు 12 సార్లు ఎన్నికలు జరిగాయి. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో నిజామాబాద్‌ రూరల్‌ నియోజకవర్గంగా మారింది. ఇప్పటి వరకు నిర్వహించిన ఎన్నికల్లో ఒకసారి సోషలిస్ట్‌ పార్టీ, టీడీపీ ఆరు సార్లు, కాంగ్రెస్‌ రెండు సార్లు, బీఆర్‌ఎస్‌ మూడు సార్లు గెలుపొందాయి. ఎన్టీఆర్‌ హయాంలో తొలిసారి 1985లో డిచ్‌పల్లి ఎమ్మెల్యేగా గెలిచిన మండవ వెంకటేశ్వరరావు టీడీపీ నుంచి పోటీ చేసి వరుసగా 1989, 1994, 1999 నాలుగు సార్లు గెలుపొందారు. తిరిగి 2009లో బీఆర్‌ఎస్‌, టీడీపీ పొత్తులో భాగంగా మరోసారి నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యేగా మండవ వెంకటేశ్వరరావు విజయం సాధించారు.

డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదువులు చేపట్టిన మండవ 2004లో నిర్వహించిన ఎన్నికల్లో ఓటమి పొందారు. అప్పుడు బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎంపీ కేశ్‌పల్లి గంగారెడ్డి మండవ పై విజయం సాధించారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా కేసీఆర్‌ పిలుపు మేరకు కేశ్‌పల్లి గంగారెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు జరిగాయి. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి ఆకుల లలిత టీడీపీ అభ్యర్థి మండవ వెంకటేశ్వరరావుపై విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో నిర్వహించిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్‌ తన ప్రత్యర్థి డి.శ్రీనివాస్‌పై గెలుపొందారు. 2018లో బీఆర్‌ఎస్‌ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్‌ గెలుపొందగా సీఎం కేసీఆర్‌ ఆర్టీసీ చైర్మన్‌ అవకాశం కల్పించారు. ప్రస్తుతం రూరల్‌ నియోజకవర్గంలో డిచ్‌పల్లి, మోపాల్‌, నిజామాబాద్‌, ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ, జక్రాన్‌పల్లి మండలాలు, 170 గ్రామాలు ఉన్నాయి.

ఇప్పటి వరకు ప్రాతినిధ్యం వహించిన వారు..


సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ
1952–57	డి శ్రీనివాస్‌రావు	సోషలిస్టు
1978–83	అంతారెడ్డి బాల్‌రెడ్డి	కాంగ్రెస్‌
1983–85	మోజెస్‌ థామస్‌చౌదరి	టీడీపీ
1985–89	మండవ వెంకటేశ్వరరావు	టీడీపీ
1989–94	మండవ వెంకటేశ్వరరావు	టీడీపీ
1994–99	మండవ వెంకటేశ్వరరావు	టీడీపీ
1999–04	మండవ వెంకటేశ్వరరావు	టీడీపీ
2004–08	గడ్డం గంగారెడ్డి	బీఆర్‌ఎస్‌
2008–09	ఆకుల లలిత	కాంగ్రెస్‌
2009–14	మండవ వెంకటేశ్వరరావు	టీడీపీ
2014–18	బాజిరెడ్డి గోవర్ధన్‌	బీఆర్‌ఎస్‌
2018–23	బాజిరెడ్డి గోవర్ధన్‌	బీఆర్‌ఎస్‌

నియోజకవర్గ ఓటర్లు

పురుషులు :	1,16,052
మహిళలు :	1,32,212
ఇతరులు :	05
మొత్తం:	2,48,269

విభిన్న పదవులు 'బాల్కొండ' సొంతం

- ఇప్పటి వరకు నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారిలో ఇద్దరికి మంత్రి పదవులు
- ఒకరికి స్పీకర్‌, మరొకరికి ప్రభుత్వ విప్‌
- మంత్రిగా కొనసాగుతున్న ప్రశాంత్‌రెడ్డి గతంలో మిషన్‌ భగీరథ వైస్‌ చైర్మన్‌గా ఎంపిక


అర్గుల్‌ రాజారాం, మాజీ మంత్రి


కేఆర్‌ సురేశ్‌రెడ్డి, మాజీ స్పీకర్‌


ఈరవత్రి అనిల్‌, ప్రభుత్వ మాజీ విప్‌


వేముల ప్రశాంత్‌రెడ్డి, మంత్రి

మోర్తాడ్‌: రాష్ట్ర రాజకీయాల్లో బాల్కొండ నియోజకవర్గానికి ఎంతో ప్రత్యేకత ఉంది. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన వారిలో నలుగురు నాయకులు విభిన్న పదవులు పొంది బాల్కొండకు వన్నెతెచ్చారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇతర నియోజకవర్గాలతో పోల్చితే బాల్కొండకు ఎంతో ప్రాధాన్యత రాష్ట్ర స్థాయిలో దక్కడం విశేషం. ఇప్పుడు ఎమ్మెల్యేగా కొనసాగుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి కేసీఆర్‌ మంత్రివర్గంలో రోడ్లు, భవనాలు, గృహనిర్మాణ, శాసనసభ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. 2014లో ఎమ్మెల్యేగా ఎంపికైన ప్రశాంత్‌రెడ్డి తొలిసారిగా మిషన్‌ భగీరథ వైస్‌ చైర్మన్‌గా ఎంపికై మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు. 2009లో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌ ప్రభుత్వ విప్‌గా మూడేళ్లు కొనసాగారు. ఆయన ఎమ్మెల్యేగా ఎంపికైన తొలిసారి ప్రభుత్వ విప్‌గా ఎంపికై రికార్డు సృష్టించారు. 2004లో నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎంపికైన కేఆర్‌ సురేశ్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్ర శాసనసభకు స్పీకర్‌గా ఎంపికయ్యారు. 2004లో డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించిన తరువాత అతనికి అత్యంత సన్నిహితుడైన సురేశ్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని భావించారు. అప్పటి రాజకీయ సమీకరణాలతో సురేశ్‌రెడ్డికి మంత్రివర్గంలో చోటు దక్కలేదు. అనూహ్యంగా శాసనసభ స్పీకర్‌గా ఎంపికై ఆ పదవికి వన్నెతెచ్చారని రాజకీయ పరిశీలకుల అభినందనలను ఆయన అందుకోవడం విశేషం. సురేశ్‌రెడ్డి 1999 మూడవసారి ఎమ్మెల్యేగా ఎంపికైన తరువాత పబ్లిక్‌ అకౌంట్స్‌ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు.

ఆయనకు ముందుగా నాలుగుసార్లు ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన అర్గుల్‌ రాజారాం 1967లో పీవీ నర్సింహారావు మంత్రివర్గంలో జౌళి చేనేత చక్కెర పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేశారు. 1972లో విద్యుత్‌, పశు సంవర్ధక శాఖల మంత్రిగా రెండోసారి బాధ్యతలను నిర్వహించారు. ఇలా బాల్కొండ నియోజకవర్గం నుంచి అసెంబ్లీలో అడుగుపెట్టిన నాయకుల్లో నలుగురు విభిన్న పదవులు పొంది ఈ స్థానానికి పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టారని చెప్పొచ్చు.

ప్రకృతి సేద్యానికి ఆధ్యాత్మికత తోడవ్వాలి


మాట్లాడుతున్న ప్రముఖ నిర్మాత దిల్‌ రాజు

మోపాల్‌: ప్రకృతి సేద్యానికి ఆధ్యాత్మికత తోడైతే పుడమి స్వర్గంగా తయారవుతుందని ప్రముఖ నిర్మాత దిల్‌ రాజు అన్నారు. మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న ఇందూరు తిరుమల క్షేత్రంలో జిల్లాకు చెందిన వైద్యుల బృందానికి ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ధాన్యంతో భోజనాలను ఆదివారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా దిల్‌ రాజు మాట్లాడుతూ.. ప్రకృతి సేద్యానికి ఆధ్యాత్మికత జోడించి ప్రతి ధాన్యపు గింజను ఔషధ తుల్య ప్రసాదంగా మార్చారని అభినందించారు. డాక్టర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు నీలి రాంచందర్‌ మాట్లాడుతూ.. అనేక రోగాలకు కారణం ఆహారమేనని, ఆహార నియమాలేనని తెలిపారు. ఐఎంఏ కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ.. నర్సింగ్‌పల్లి ఆలయం, గ్రామ రైతుల ఆధ్యాత్మికత ప్రకృతి వ్యవసాయం ఎంతో నిష్టతో చేస్తున్నారని కొనియాడారు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు విజయరాం మాట్లాడుతూ.. మంచి ఆహారమే ప్రస్తుత రోజుల్లో ఔషధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన ధర్మకర్త నర్సింహారెడ్డి, జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ప్రతిమారాజ్‌, వైద్యులు, రైతులు పాల్గొన్నారు.

15 నుంచి భగవద్గీత పోటీలు

నిజామాబాద్‌ సిటీ: పాఠశాల స్థాయి విద్యార్థుల్లో భక్తి వికాసం, దేశ భక్తి, ధార్మిక చింతనతో పాటు భగవద్గీతపై అవగాహన కల్పించేందుకు నవంబర్‌ 15 నుంచి పోటీలు నిర్వహించనున్నట్లు బాలాజీ సత్సంగం అధ్యక్షుడు కృష్ణకుమార్‌ తెలిపారు. ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్‌ సమీపంలో ఉన్న గీతాభవన్‌లో వెల్మల్‌ బాలాజీ సత్సంగం ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా ప్రభుత్వ, ప్రయివేట్‌ పాఠశాలల యాజమాన్యలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణకుమార్‌ మాట్లాడుతూ.. 15 ఏళ్ల నుంచి జిల్లాస్థాయి భగవద్గీత శ్లోక పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వెల్మల్‌ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బహుమతులను అందజేస్తామన్నారు. నవంబర్‌ 15న వర్ని మండల కేంద్రం శ్రీ మల్లారెడ్డి వివేకానంద ఉన్నత పాఠశాల, 16న రెంజల్‌ మండలం కందకుర్తి కేశవ శిశు మందిరంలో, 17న మాక్లూర్‌ మండలం కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో, 18న నందిపేట మండల కేంద్రం లియా లిటిల్‌ ఫ్లవర్‌, టీఎస్‌ మోడల్‌ స్కూల్‌, 20న రెంజల్‌ మండలం బోర్గం ఉషశ్రీ విద్యాలయంలో, 21న తొర్లికొండ యోగీశ్వర పాఠశాల, 22న గొట్టిముక్కల జడ్పీ ఉన్నత పాఠశాల, 23న వెల్మల్‌ శారద విద్యానికేతన్‌, జడ్పీ ఉన్నత పాఠశాల, అక్షరదాం పాఠశాలలో విద్యార్థులకు గీత శ్లోక పఠన పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు, కార్యవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాల ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్‌ యాదిరెడ్డి

మోపాల్‌: ఎన్నికల సమయంలో ధాన్యం కొనుగోళ్లల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని అదనపు కలెక్టర్‌ యాదిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని బోర్గాం(పి), మోపాల్‌, నర్సింగ్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఎస్‌వో చంద్రప్రకాశ్‌, డీసీవో సింహాచలం, డీఎం జగదీశ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం బాడ్సి సొసైటీ కార్యాలయంతోపాటు కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం క్వింటాలుకు ఏ గ్రేడ్‌ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 చెల్లిస్తోందని తెలిపారు. ధాన్యం రవాణాలో గతంలో ఎదురైన సమస్యలను రైతులు, సొసైటీ సిబ్బంది ఆయనకు వివరించగా, కాంట్రాక్టర్‌ను మార్చామని, వేరే వారికి రవాణా బాధ్యతలు అప్పగించామని వివరించారు. అదేవిధంగా కంజర్‌లో ఎంపీటీసీ శ్రావణ్‌ రైతులతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అదనపు కలెక్టర్‌ వెంట తహసీల్దార్‌ ఖాజా ఖుద్బుద్దీన్‌, రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, ఉమాపతిరావు, మోహన్‌రెడ్డి, సాయిరెడ్డి, నరేందర్‌, సొసైటీ సీఈవోలు నర్సయ్య, కృష్ణ, సాయికుమార్‌ పాల్గొన్నారు.

వడ్డేపల్లిని కలిసిన ఎల్లారెడ్డి నాయకులు


సుభాష్‌రెడ్డితో ఎల్లారెడ్డి నేతలు, కార్యకర్తలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డికి చెందిన నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి నివాసానికి చేరుకుని భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. కాంగ్రెస్‌ పార్టీ టికెట్టు దక్కక పోవడంతో సుభాష్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్‌ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. భవిష్యత్తు కార్యాచరణ గురించి కార్యకర్తలు సుభాష్‌రెడ్డితో చర్చించేందుకు ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ సుభాష్‌రెడ్డితో చర్చించారు. రెండు రోజుల్లో కార్యాచరణ గురించి ప్రకటించనున్నట్లు సుభాష్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు


శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి చక్రతీర్థంలో కమాండెంట్‌ దంపతులు, అర్చకులు

డిచ్‌పల్లి: మండలంలోని ఏడో బెటాలియన్‌లో ఈ నెల 24 నుంచి వైభవంగా కొనసాగుతున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నిత్యారాధన, హవనం, పూర్ణాహుతి హోమం, మధ్యాహ్నం వనవిహారం, చక్రస్నానం, స్నపనతిరుమంజనం, నివేదిన, హారతి, తీర్థగోష్టి కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. కమాండెంట్‌ బి.రాంప్రకాష్‌ దంపతులు, అర్చకులతో కలిసి స్వామి వారి చక్రతీర్థంలో పాల్గొన్నారు. సాయంత్రం పుష్పయాగం, అవాహిత దేవతోద్యాసనం, ఏకాంతసేవ, యజమానులకు ఆశీర్వచనము కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ కమాండెంట్స్‌ సి.ఆంజనేయరెడ్డి, కె.భాస్కరరావు, ఆలయ ధర్మకర్త కె.శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ భూదానకర్త కుమారులు ప్రమోద్‌ జాజు, వినోద్‌ జాజు, ఏవో హంసరాణి, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

ఢిల్లీలో గుంజలి విద్యార్థి మృతి


నందు(ఫైల్‌)

మాక్లూర్‌: మండలంలోని గుంజలి గ్రామానికి చెందిన జింక నందు(24) అనే విద్యార్థి చదువుతున్న హాస్టల్‌ గదిలో అనుమానాస్పదంగా మృతి చెందిఉన్నట్టు మృతుడి కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నందు ఢిల్లీలో హాస్టల్లో ఉంటూ బీటెక్‌ ఆర్కిటెక్చర్‌ విద్యను అభ్యసిస్తున్నాడు. మొదటగా చేయి కోసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఆదివారం తెల్లవారు జామున హాస్టల్‌ నుంచి సమాచారం అందిందని కుటుంబీకులు తెలిపారు. కానీ మెడ భాగం బలంగా కోసి ఉందని, శరీరమంతా రక్తమడుగులో ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. నిజంగానే ఆత్మహత్య చేసుకున్నాడా ఎవరైనా చంపి ఉంటారా అనేది తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన నందు శవం ఇంకా స్వగ్రామానికి చేరుకోలేదు. అందరితో కలుపుగోలుగా ఉండే నందు మృతిపై గ్రామంలో విషాదచాయలు ఆలుముకున్నాయి.

ఒకరి అదృశ్యం


మొగులయ్య

సుభాష్‌నగర్‌: రూరల్‌ మండలంలోని కొత్తపేట్‌కు చెందిన వాచారి మొగులయ్య అదృశ్యమైనట్లు వన్‌ టౌన్‌ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు ఆదివారం తెలిపారు. ఈ నెల 28న ఆరోగ్యం చికిత్స నిమిత్తం మొగులయ్య జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. 29న తెల్లవారు జామున 3.30 గంటలకు బయటికి వెళ్లిపోయాడు. ఆస్పత్రిలో ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో మొగులయ్య భార్య పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి)లో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొప్పుల సుమలత అలియాస్‌ జ్యోతి (26) ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పవన్‌నగర్‌కు చెందిన కాల బాలాజీ, అదే కాలనీకి చెందిన సుమలతతో శనివారం రాత్రి తన ద్విచక్రవాహనంపై డిచ్‌పల్లి వైపు వస్తున్నాడు. ధర్మారం(బి) గ్రామం వద్దకు రాగానే వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన కారు వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో బాలాజీ అక్కడికక్కడే మృతి చెందగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సుమలత మృతి చెందింది. కారులో ఇందల్వాయి మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఉండగా ప్రమాదం జరిగిన వెంటనే ఒకరు పారిపోగా, మిగిలిన ఇద్దరు రజినీకాంత్‌, ఖాజలను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మృతుడు బాలాజీ తల్లి సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కూరగాయల షాపులో చోరీ

రుద్రూర్‌: మండల కేంద్రంలోని కూరగాయల దుకాణంలో శనివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. షాపులోని కూరగాయలు, నగదు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. గతేడాది నుంచి పలుమార్లు దుకాణంలో దుండగులు చోరీకి పాల్పడుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొంగతనం జరిగిన ప్రతి సారి పోలీసులకు సమాచారం ఇచ్చిన వారు వచ్చి వివరాలు సేకరించి వెళ్లడం తప్పా ఫలితం శూన్యమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఇంటి ముందున్న బైక్‌లు, ఆలయాల్లోని హుండీలను చోరీకి పాల్పడుతున్నారు. అధికారులు స్పందించి పెట్రోలింగ్‌ ముమ్మరం చేసి ప్రత్యేక నిఘా పెట్టి దొంగతనాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భార్యను కడతేర్చిన భర్త


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని సూర్యనగర్‌లో భార్యను భర్త శనివారం రాత్రి గొంతునులిమి హత్యచేశాడు. హత్య చేసిన తర్వాత ఐదేళ్ల కూతురితో కలిసి నిందితుడు నాలుగో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపునకు చెందిన ప్రీతి(26)ని, బోధన్‌కు చెందిన ప్రవీణ్‌ ఆరేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి నగరంలోని సూర్యనగర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. వారికి ఐదేళ్ల కుమార్తె ఉంది. శనివారం రాత్రి భార్యభర్తల మధ్య గొడవ చోటుచేసుకుంది. దీంతో ప్రవీణ్‌ కోపంతో ప్రీతి గొంతునులిమి హత్య చేశాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారమిచ్చారు. అంత కుముందే నిందితుడు ప్రవీణ్‌ తన కూతురుతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. కాగా సంఘటనా స్థలాన్ని ఏసీపీ కిరణ్‌కుమార్‌, సీఐ నరహరి పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రీతి అమ్మమ్మ నాయకోటి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1995–96 పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరిని ఒకరు కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నర్సాగౌడ్‌, డాక్టర్‌ అశోక్‌శర్మ, ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య, నర్సయ్య, లక్ష్మీనారాయణ, మురళీధర్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గంగమోహన్‌,సందీప్‌,రజనీకాంత్‌,చంద్రశేఖర్‌,రవికుమార్‌, రవీందర్‌, సాయారెడ్డి, శ్రీదేవి, కృష్ణవేణి, సుజాత, సుకన్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

బాల్కొండ: ముప్కాల్‌ మండలం నల్లూర్‌ గ్రామానికి చెందిన సాయికుమార్‌ (23) తాగుడికి బానిసై ఒంటిపై పెట్రోల్‌ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై భాస్కరాచారి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి రాజు బాయి దత్తత కుమారుడు సాయికుమార్‌ తాగుడికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. తరచూ తల్లితో గొడవ పడుతూ కొడుతుండేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం తల్లిని కొట్టాడు. దీంతో ఆమె బంధువుల ఇంటికి వెళ్లింది. తల్లి లేని సమయంలో శనివారం రాత్రి నా చావుకు ఎవరూ కారణం కాదని, అమ్మా నన్ను క్షమించు.. తరచూ నిన్ను కొట్టే వాడిని, మరో జన్మలో నీ కడుపునే పుట్టాలని ఉందని సూసైడ్‌ నోట్‌ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాల్కొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

డ్రంకన్‌ డ్రైవ్‌ తనిఖీలు

మోపాల్‌: మండల కేంద్రంలో ఐదుగురిపై డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్‌ ఆదివారం తెలిపారు. మద్యం సేవించి ప్రయాణిస్తున్న వారిని తనిఖీలు చేసి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తుండగా నాలుగు ప్రదేశాల్లో దాడులు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కంజర్‌లో సైబర్‌ నేరాలపై గ్రామస్తులు, యువకులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఫోన్లకు వచ్చే ఓటీపీ ఎవరికీ చెప్పవద్దని, బ్యాంకు ఖాతా వివరాలు కూడా తెలపవద్దని సూచించారు. ఆయన వెంట ఏఎస్సైలు దయాళ్‌సింగ్‌, రమేష్‌ బాబు, సిబ్బంది ఉన్నారు.